క్లుప్తంగా

నేత్ర శస్త్రచికిత్సకు 45 మంది ఎంపిక



వృద్ధుడి కంటిని పరీక్షిస్తున్న వైద్యురాలు

రాజాం సిటీ: డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని బొద్దాం గ్రామంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. బొద్దాం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ వైద్యులు శిబిరానికి హాజరైన దాదాపు 146 మంది కళ్లను పరీక్షించగా, 45 మందిని నేత్ర శస్త్రచికిత్సకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు సాయికుమార్ తెలిపారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రాజాం: మండలంలోని పలు గ్రామాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ బాసూరి శంకరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆగూరులో ఒకటి, కంచరాం గ్రామంలో మరో రెండు వలంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఆసక్తి ఉన్న వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 3, 4వ తేదీల్లోగా దరఖాస్తు చేసుకోవాలని, 5న దరఖాస్తుల పరిశీలన, 6న మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించి, నియామకపత్రాలు అందజేస్తామని పేర్కొన్నారు.

సంతకవిటి: మండలంలోని కృష్ణంవలస, గోళ్లవలస, జి.ఎస్.పురం, మిర్తివలస, గరికిపాడు గ్రామాల్లో ఖాళీగా ఉన్న ఒక్కో వలంటీర్ పోస్టుతో పాటు బొద్దూరులో మరో మూడు వలంటీర్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ జి.వి.రవికుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు 3, 4వ తేదీల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం



గుయ్యానవలసలో చేపట్టిన డ్రైనేజీ నిర్మాణ పనులు

రాజాం: మండలంలోని గుయ్యానవలస గ్రామంలో రూ.5 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణాల పనులను ఆదివారం ప్రారంభించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే కంబాల జోగులు దృష్టికి ఈ సమస్యలు తీసుకువెళ్లామని, అనంతరం మంజూరైన నిధులతో ఈ పనులు చేయిస్తున్నామని సర్పంచ్ సమతం రమేష్ వెల్లడించారు. ఈ అభివృద్ధి పనులను పీఆర్ జేఈ ప్రభాకరరావు, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ పర్యవేక్షించారు. నాణ్యతా ప్రమాణాల మేర పనులు పూర్తి చేయాలని సూచించారు.

అధికలోడు వాహనాలతో ప్రమాదం



లోడు ఎక్కువ కావడంతో పైకిలేచిన ట్రాక్టర్ ఇంజిన్

రాజాం: పట్టణంలో నిబంధనలు అతిక్రమించి మరీ ట్రాక్టర్లు, లగేజీ ట్రాలీల ప్రయాణాలు కొనసాగుతున్నాయి. ప్రధానంగా ఇటుక లోడు ట్రాక్టర్లు డబుల్ లోడుతో రోడ్డు మీదుగా వెళ్తుండడంతో అదుపుతప్పి పడిపోతున్నాయి. ఫలితంగా దాని వెనక నుంచి వాహనదారులపై వాహనంతో పాటు ఇటుకలు పడి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి, వీటిని నియంత్రించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

చురుగ్గా జగనన్న సురక్ష సర్వే



జగనన్న సురక్ష సర్వేలో వలంటీర్ శివ, వెల్ఫేర్ అసిస్టెంట్ హరి

తెర్లాం: మండలంలోని తెర్లాం-2, నెమలాం గ్రామ సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం సర్వే చాలా చురుగ్గా జరుగుతోంది. ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, తహసీల్దార్ డి.రత్నకుమార్ ఆదేశాల మేరకు ఆయా గ్రామాల్లోని వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ఆదివారం ఇంటింటికీ వెళ్లి, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందడం లేదా.. ఎవరికైనా జనన, మరణ, కుల, ఆదాయం వంటి 11 ధ్రువపత్రాల్లో ఏవైనా కావాలా అడిగి తెలుసుకున్నారు. ధ్రువపత్రాల కోసం పేర్లు నమోదు చేసుకున్న వారికి ఈ నెల 5వ తేదీన సచివాలయాల్లో అందజేస్తామని తెలిపారు.

పల్లెలకు ఆరోగ్య రక్ష

- గ్రామీణుల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం పెద్దపీట
- విలేజ్ హెల్త్ క్లినిక్‌ల పరిధిలో టాస్క్‌ఫోర్స్ కమిటీల ఏర్పాటు
- ప్రజారోగ్యం, వెల్‌నెస్ సెంటర్ల కార్యక్రమాలపై పర్యవేక్షణ
- ఆరోగ్య రంగంలో సుస్థిరాభివృద్ధి లక్ష్య సాధనకు కృషి
- ఆనందం వ్యక్తం చేస్తున్న ప్రజలు





రామభద్రపురం పీహెచ్‌సీ, (ఇన్‌సెట్‌లో) రొంపల్లిలో ఇంటి వద్దనే ఉన్న వృద్ధురాలికి వైద్యసేవలందిస్తున్న వైద్యాధికారి శిరీష

రామభద్రపురం: గ్రామీణుల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. ఇప్పటికే 104 అంబులెన్స్, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ఇంటింటికీ వైద్యసేవలందిస్తున్న జగన్ సర్కార్ ఇప్పుడు ఆ సేవలను పటిష్టం చేయడమే కాకుండా గ్రామాల్లోని ప్రజల మెరుగైన ఆరోగ్యమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన వెల్‌నెస్ సెంటర్ల కార్యక్రమాల పర్యవేక్షణకు ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్ కమిటీల ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేసింది. క్షేత్రస్థాయిలో దీనిని పక్కాగా అమలు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లాలోని 27 మండలాల్లో దాదాపు 530 గ్రామ సచివాలయాల పరిధిలో ఈ టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేశారు. ఆరోగ్య రంగంలో సుస్థిరాభివృద్ధి లక్ష్య సాధనే దీని లక్ష్యంగా ప్రభుత్వం పేర్కొంది. మరోవైపు గ్రామీణుల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేయడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆరుగురు సభ్యులతో కమిటీ..

ప్రతీ గ్రామ సచివాలయం పరిధిలో ఆరుగురు సభ్యులతో కూడిన టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేశారు. బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి, అర్హత కలిగిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్(సీహెచ్‌ఓ)మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్(ఎంఎల్‌హెచ్‌ఓ) ప్రతీ గ్రామంలో టాస్క్‌ఫోర్స్ కమిటీ లీడర్‌గా వ్యవహరిస్తారు. ఏఎన్ఎం, ఆశవర్కర్లు, అంగన్‌వాడీ టీచర్, స్కూల్ హెల్త్ అంబాసిడర్, గ్రామాల్లోని డ్వాక్రా గ్రూపు అధ్యక్షురాలు ఈ కమిటీ సభ్యులుగా ఉంటారు.

పక్కాగా పర్యవేక్షణ..

గ్రామీణుల ఆరోగ్యంపై ఈ టాస్క్‌ఫోర్స్ కమిటీ నిరంతరం పక్కాగా పర్యవేక్షించాలి. ప్రధానంగా గర్భిణులు, శిశువులు, మహిళలు, వృద్ధులు, పిల్లల్లో రక్తహీనత, పౌష్టికాహార లోపం ఉన్నవారిని గుర్తించాలి. వారి అనారోగ్యాల నివారణ చర్యలు, గ్రామ ప్రజల జీవనశైలి, రోగాల నివారణ, చికిత్సలపై ఈ టాస్క్‌ఫోర్స్ కమిటీ నిత్యం అప్రమత్తంగా ఉండాలి. విద్యార్థుల ఆరోగ్య వివరాలను స్కూల్‌లోనే హెల్త్ అంబాసిడర్ పర్యవేక్షించాల్సి ఉంటుంది. కౌమారదశలోనే బాలికలకు రోజూ ఐఎఫ్ఏ మాత్రలు పంపిణీ చేయాలి. బరువు తక్కువగా ఉన్న పిల్లలకు పౌష్టికాహారం అందించాలి. బాలికల్లో అవసరమైన వారికి శానిటరీ ప్యాడ్స్ సరఫరా వివరాలు, బరువు తక్కువగా ఉన్న పిల్లల మధ్యాహ్న భోజనం వివరాలను కమిటీ లీడర్లకు అందించాలి. ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేయించాలి.

- అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, గర్భిణుల రక్తహీనతపై పర్యవేక్షణ, గర్భిణులకు ప్రసవానికి ముందు, తర్వాత సంరక్షణ, నులిపురుగు నివారణ మందుల పంపిణీ, ఆరోగ్య సంరక్షణ, పౌష్టికాహారం అందించడం వంటి సేవలు సక్రమంగా అందేలా సమన్వయం చేయాలి.
- గ్రామాల్లో నిర్వహించే డ్వాక్రా గ్రూపు సమావేశాలకు టీమ్ లీడర్ విధిగా హాజరయ్యేలా టీమ్‌లో ఉన్న డ్వాక్రా గ్రూపు అధ్యక్షురాలు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలి. గ్రూపు సభ్యుల ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకోవాలి.
- గర్భాధారణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇమ్యునైజేషన్ ద్వారా వ్యాధుల నివారణపై అవగాహన కల్పించాలి.
- బాల్యవివాహాలు నిర్మూలనతో పాటు కుటుంబ నియంత్రణకు ప్రణాళికలు అమలు చేయాలి. ప్రతీ శుక్రవారం డ్రై డే పాటించి, పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించాలి.
- క్షేత్రస్థాయిలో సిబ్బంది సమన్వయంతో సేవలందించేలా చూడాల్సిన బాధ్యత స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిపై ఉంటుంది.

గ్రామ స్థాయిలో దంతవైద్యం..

గ్రామ స్థాయిలోనే అన్ని రకాల వైద్యసేవలందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు వ్యయ ప్రయాసలు తగ్గిస్తోంది. ఇందులో భాగంగానే పీహెచ్‌సీల్లో దంత వైద్య సేవలు అందిస్తోంది. దంత వైద్యులు వారానికి ఒకసారి ప్రతీ పీహెచ్‌సీని సందర్శిస్తూ అక్కడే డెంటల్ క్లినిక్‌లు నిర్వహిస్తున్నారు. చిన్నపాటి దంత సమస్యలకు సైతం పీహెచ్‌సీలోనే చికిత్స అందిస్తున్నారు. మెరుగైన వైద్యం అవసరమైతే దగ్గరలోని సీహెచ్‌సీ, ఏరియా, జిల్లా ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు.

ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి..



గ్రామాల్లో ఆరోగ్య పరిరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేస్తాం. సంపూర్ణ ఆరోగ్యం దిశగా పల్లెలను తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతోంది. ఈ కమిటీల ద్వారా గ్రామీణుల అనారోగ్య సమస్యలు పరిష్కరించవచ్చు. ఆరోగ్యం, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపేందుకు చర్యలు చేపట్టాం.

చొక్కాపు లక్ష్మణరావు, ఎంపీపీ, మండలపీహెచ్‌సీల అభివృద్ధి కమిటీ చైర్మన్, రామభద్రపురం

ప్రజలకు ఎంతో ఉపయోగం..



విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఆరోగ్యంతో పాటు వెల్‌నెస్ కార్యక్రమం ద్వారా హార్ట్ ఎటాక్, క్యాన్సర్, హైపర్ టెన్షన్, తదితర సమస్యలపై అవగాహన కల్పిస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలందిస్తున్నాం. అలాగే గ్రామాల్లో మినిస్టరీ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఇండియా వారి ఆధ్వర్యంలో ప్రజల ఆరోగ్య నివేదిక సర్వే చేపడుతున్నాం. ఈ సర్వేలో ప్రజల ఆరోగ్య పరిస్థితి, పౌష్టికాహారం అమలు ఎలా ఉందోనని శాంపిల్ సర్వే నిర్వహిస్తున్నాం.

-దిలీప్‌కుమార్, పీహెచ్‌సీ వైద్యాధికారి, రామభద్రపురం

97 శాతం పెన్షన్ల పంపిణీ



రామభద్రపురం: పెన్షన్ అందజేస్తున్న సచివాలయ కన్వీనర్ కామేశ్వరరావు, వలంటీర్



తెర్లాం: నెమలాంలో వృద్ధురాలికి పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ శివ

రామభద్రపురం: మండలంలో సామాజిక పెన్షన్ల పంపిణీ జోరుగా కొనసాగుతోంది. ఆదివారం నాటికి దాదాపు 97 శాతం మేర పెన్షన్లు అందజేసినట్లు అధికారులు తెలిపారు. మండల పరిధిలో 7,805 మంది లబ్ధిదారులు ఉండగా, వారి ఇంటి వద్దకే వలంటీర్లు వెళ్లి, పెన్షన్లు అందజేస్తుండడంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు.

తెర్లాం: మండలంలోని 21 గ్రామ సచివాలయాల పరిధిలో సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమం రెండో రోజు కూడా కొనసాగింది. అనారోగ్యం రీత్యా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి కూడా వలంటీర్లు వారి వద్దకు వెళ్లి, పెన్షన్లు అందజేశారు.

నేడు కొరటాంలో గడప గడపకు..

తెర్లాం: మండలంలోని కొరటాం గ్రామ సచివాలయం పరిధిలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు పాల్గొంటారని, మండల స్థాయి అధికారులంతా హాజరు కావాలని కోరారు.

రోడ్డు పనులు పరిశీలించిన ఎమ్మెల్యే



ఆనవరం బీటీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలనలో ఎమ్మెల్యే శంబంగి

బాడంగి: మండలంలోని ఆనవరం గ్రామం వద్ద జరుగుతున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు ఆదివారం పరిశీలించారు. ఆనవరం-పినపెంకి జంక్షన్ నుంచి ఆనవరం గ్రామం వరకు దాదాపు రూ.70 లక్షల నిధులతో ఈ రోడ్డు నిర్మాణం జరుగుతోంది. పనులు ఏ మేర జరుగుతున్నాయోనన్న విషయాన్ని ఎమ్మెల్యే అక్కడి కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. నాణ్యతా ప్రమాణాల మేర పనులు చేపట్టాలని సూచించారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



వెంకటాపురంలో ఏపుగా పెరిగిన చెరకు పంట వద్ద రైతు

రేగిడి: చెరకు సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ సూచించారు. మండలంలోని వెంకటాపురం గ్రామంలో యాజమాన్య పద్ధతిలో చెరకు సాగు చేసి, అధిక దిగుబడి సాధిస్తున్న రైతు కింజరాపు సురేష్‌కుమార్ పొలాలను ఆదివారం పరిశీలించిన ఆయన చెరకు విత్తే సమయంలో ప్రధానంగా ఒక వరుసకు మరో వరుసకు మధ్య రెండు అడుగులు మాత్రమే రైతులు ఖాళీ ఉంచుతారని, అలా కాకుండా ఐదు అడుగుల సాళ్లు తేడా ఉంటే ఎంతో ఏపుగా పంట పెరుగుతుందని రైతులకు వివరించారు. ఈ విధానం ద్వారా పంట దిగుబడి అధికంగా రావడమే కాకుండా పంటకు చీడపీడలు కూడా పట్టవని, పంటలో కలుపు తీసేందుకు, మినీ ట్రాక్టర్ ద్వారా దుక్కుకు కూడా అవకాశం ఉంటుందన్నారు. గాలి, వెలుతురు కూడా చక్కగా పంటకు వచ్చే అవకాశం ఉందని, మొదళ్లు బలంగా తయారవుతాయన్నారు.

బాడంగిలో 'చదవడం మాకిష్టం'



పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

బాడంగి: స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గ్రంథాలయానికి వచ్చిన విద్యార్థులతో లైబ్రేరియన్ ఆర్.దుర్గాప్రసాద్ వారికి ఇష్టమైన కథల పుస్తకాలు ఇచ్చి, చదివించారు. చిన్నతనం నుంచే పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలని, తద్వారా జ్ఞానం అలవడుతుందన్నారు. ప్రతిరోజూ ఏదో ఒక మంచి పుస్తకం చదవడం అలవాటు చేసుకోవాలని ఆయన సూచించారు.

'చలో మాదిగ' సభను విజయవంతం చేయండి



ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడితో జిల్లా ఎంఆర్‌పీఎస్ నాయకులు

బొబ్బిలి: ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా తెలంగాణలోని హైదరాబాద్‌లో ఈ నెలాఖరులో జరిగే చలో మాదిగ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.సురేష్ మాదిగ పిలుపునిచ్చారు. ఇదే విషయమై స్థానిక పట్టణంలోని గంటి ప్రసాదం స్మారక భవనంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణతో ఉపకులాలకు మేలు జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో అందరూ వర్గీకరణకు మద్దతు తెలపాలన్నారు. ఈ నెల 7వ తేదీ నుంచి గ్రామాల్లో సభలు కూడా నిర్వహించి, కార్యక్రమంపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఆయనను స్థానిక ఎంఆర్‌పీఎస్ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బోను శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేడు జగనన్న అమ్మఒడి కార్యక్రమం

బాడంగి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న అమ్మఒడి పథకం నిధుల విడుదల కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ-2 ఎం.రాజేశ్వరి, హెచ్ఎం డి.సత్యనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు హాజరయ్యే ఈ కార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులంతా హాజరు కావాలని వారు కోరారు.

రోడ్డు నిర్మించాలని వినతి



రోడ్డు నిర్మించాలని ఎంపీపీని కోరుతున్న రొంపల్లి గ్రామస్తులు

రామభద్రపురం: మండలంలోని రొంపల్లి గ్రామంలో ఓ వీధిలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆ గ్రామ మహిళలంతా ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావును ఆదివారం వినతించారు. స్పందించిన ఆయన ఈ సమస్యను ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు దృష్టికి తీసుకువెళ్లి, రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా చూస్తానని, లేదంటే మండల ప్రజాపరిషత్ నిధులైనా మంజూరు చేయించి, తప్పనిసరిగా రోడ్డు వేయిస్తానని హామీ ఇచ్చారు. పంచాయతీ రాజ్ ఏఈఈతో ఎస్టిమేట్ వేయించాలని వైఎస్సార్ సీపీ నాయకుడు పువ్వల మురళీకృష్ణకు సూచించారు. ఎన్నో ఏళ్లుగా రోడ్డు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్న వారు రోడ్డు సమస్య పరిష్కారానికి ఎంపీపీ ద్వారా భరోసా దొరకడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వాహన తనిఖీలు



వాహనాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ తిరుమలరావు, ఎస్ఐ సురేంద్రనాయుడు

రామభద్రపురం: స్థానిక బైపాస్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్ట్ వద్ద సీఐ తిరుమలరావు, ఎస్ఐ సురేంద్రనాయుడు సిబ్బందితో కలిసి ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. అంతర్‌రాష్ట్ర కూడలి కావడంతో గంజాయి వంటి మత్తు పదార్థాలు అక్రమంగా తరలించే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో తనిఖీలు ముమ్మరం చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఎస్పీ దీపికా పాటిల్ ఆదేశాల మేరకు నిత్యం సిబ్బంది తనిఖీలు చేస్తారని, ఎవరైనా మత్తు పదార్థాలు రవాణా చేస్తూ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆశాజనకంగా మొక్కజొన్న సాగు

తెర్లాం: ఖరీఫ్ సీజన్‌లో రైతులు మెట్టు భూముల్లో పండించిన మొక్కజొన్న పంట ఆశాజనకంగా ఉంది. ఏటా మండలంలో అధిక విస్తీర్ణంలో మొక్కజొన్న పంటను అన్నదాతలు సాగు చేస్తున్నారు. వరి పంట తర్వాత రైతులు దీనిని ఎక్కువగా పండించేందుకు ఆసక్తి కనబరుస్తుండడం విశేషం. ఈ ఏడాది మొక్కజొన్న సాగుచేసే సమయానికి మంచి వాతావరణం ఉండడంతో రైతులు మొక్కజొన్న విత్తనాలు వేశారు. విత్తనాలు వేసిన కొన్ని రోజులకు వానలు కురవకపోవడం, ఎండలు ఎక్కువగా కాయడంతో చాలావరకు మొలకలు రాలేదు. కొన్ని గ్రామాల్లో రెండోసారి మొక్కజొన్న విత్తనాలను రైతులు వేశారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉండడం, అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో మొక్కజొన్న సాగు బాగుందని, ఇప్పుడు పంటలో గొప్పులు తవ్వడం, కలుపుతీత వంటి పనులు చేయిస్తున్నామని రైతులు చెబుతున్నారు.

పేదలకు అండగా సీఎం సహాయ నిధి



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

- ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: పేదలకు అండగా సీఎం సహాయ నిధి(సీఎంఆర్ఎఫ్) నిలుస్తోందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. ఆదివారం స్థానిక పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కంచరాం గ్రామానికి చెందిన యండమూరి పాపమ్మకు మంజూరైన రూ.1 లక్ష సీఎం రిలీఫ్ ఫండ్‌ను అందజేశారు. ఆమె భర్త యండమూరి పెంటయ్య అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన వైద్య ఖర్చుల నిమిత్తం పాపమ్మ చేసిన అప్పులు చెల్లించేందుకు సీఎం సహాయ నిధికి దరఖాస్తు పెట్టుకోగా, నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ నాలుగేళ్లలో రాజాం నియోజకవర్గంలో 100కు పైగా కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ సాయం అందించినట్లు పేర్కొన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ, అప్పులు చేసి వైద్యం చేయించుకుంటున్న కుటుంబాలకు ఈ ఆర్థికసాయం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. నిష్పక్షంగా, పారదర్శకంగా పాలన చేస్తూ సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చాలా గొప్పనాయకుడు అని, ఆయనది మంచి మనసు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, కంచరాం పంచాయతీ సర్పంచ్ గెడ్డాపు అప్పలనాయుడు, ఎంపీటీసీ కడగల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బీజామృతంతో విత్తనశుద్ధి మేలు



రేగిడి: గుల్లపాడులో బీజామృతంతో ధాన్యం విత్తనాలను శుద్ధి చేయిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది



సంతకవిటి: జి.ఎస్.పురంలో బీజామృతంతో విత్తనాలు శుద్ధి చేస్తున్న రైతులు



బాడంగి: కోడూరులో బీజామృతంతో విత్తనాల శుద్ధిపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రేగిడి: బీజామృతంతో విత్తనశుద్ధి చేయడం ద్వారా మేలు జరుగుతుందని ప్రకృతి వ్యవసాయం ఎల్-2 అధికారి గౌరీశ్వరరావు అన్నారు. మండలంలోని గుల్లపాడు గ్రామంలో రైతులకు బీజామృతంతో విత్తనశుద్ధిపై ఆదివారం అవగాహన కల్పించారు. ఇలా విత్తనశుద్ధి చేయడం వల్ల తెగుళ్లు, చీడపీడలు బారిన విత్తనాలు పడకుండా ఉంటాయని, తద్వారా పంట దిగుబడి బాగా వస్తుందన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు పి.తవిటినాయుడు, రమణ తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: మండలంలోని జి.ఎస్.పురం గ్రామంలో విత్తనాల శుద్ధిపై ఆదివారం అవగాహన కల్పించారు. మండల వ్యవసాయాధికారి పైల నవీన్ మాట్లాడుతూ పొలంలో విత్తనాలు జల్లే ముందు బీజామృతంతో వాటిని శుద్ధి చేసుకోవాలని సూచించారు. ఇలా చేయడం ద్వారా పంటకు రసాయన ఎరువులు అవసరం ఉండదన్నారు. ఆరోగ్యవంతమైన పంట చేతికి రావడంతో పాటు తెగళ్లు, చీడపీడలు సోకవన్నారు. అలాగే మొలకశాతం కూడా పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.ఈశ్వరరావు, వీఏఏ జి.విద్యాసాగర్, రైతులు పాల్గొన్నారు.

బాడంగి: మండలంలోని కోడూరు, బాడంగి, లక్ష్మీపురం, ముగడ, గొల్లాది గ్రామాల్లో బీజామృతంతో విత్తనాలు శుద్ధి చేయడంపై రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. పొలంలో వీటిని చల్లేముందు ఇలా శుద్ధి చేయడం వల్ల విత్తనాలకు తెగుళ్లు, చీడపీడలు సోకవని, అలాగే మొలక శాతం పెరుగుందని తద్వారా పంట దిగుబడి అధికంగా వస్తుందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది వై.ఈశ్వరరావు, తులసి తదితరులు పాల్గొన్నారు.